క్లుప్తంగా

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



సాక్షి ఎఫెక్ట్..

బయ్యారం : 'కూలీలు కాదు రైతులే' శీర్షికన శుక్రవారం బయ్యారంలోని సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో వచ్చిన వార్తాకథనానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సవ్ టొప్పో స్పందించారు. కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన సమస్యలపై రైతులతో మాట్లాడారు. నిర్వాహకులతో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రంలో రైతులకు అందించాల్సిన సేవల్లో ఎ లాంటి లోటు జరగకుండా చూడాలన్నారు. కాంటాలు పెట్టిన వెంటనే ధాన్యం బస్తాలను లారీల ద్వారా మిల్లులకు రవాణా చేయించాలన్నారు.

చెత్తను శుద్ధి చేయడానికి బయోమైనింగ్



మహబూబాబాద్: చెత్తను శుద్ధి చేయడానికి బయో మైనింగ్ యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 26వ వార్డులోని చెత్త డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసి న బయోమైనింగ్ యంత్రాంగం పని చేసే విధానాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బయోమైనింగ్ ద్వారా చెత్త శుద్ధి చేసి సేంద్రియ ఎరువును తయారు చేస్తుందన్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ డొలాగర్ స్వాతి, నాయకులు శంకర్, శ్రీను ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్ : వర్షం పడే సూచనలు ఉన్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ భగవాన్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం సందర్శించారు. వాతావరణ కేంద్రం హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం వర్షార్పణం కాకుండా జాగ్రత్తపడాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఏపీఎం తిలక్, ఎంఆర్ఐ కృష్ణప్రసాద్ ఉన్నారు.

ఆర్థికసాయం

కేసముద్రం: కేసముద్రం స్టేషన్‌కి చెందిన ఓ పేదింటి ముస్లీం యువతి వివాహ ఖర్చులకు ఇదే గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఓలం బుచ్చిలింగం, సువర్ణ దంపతులు రూ.25వేల ఆర్థికసాయాన్ని శుక్రవారం అందజేశారు. ఎస్కే నజీర్, కతీజ దంపతులకు కుమార్తె రిజ్వాన, కుమారుడు ఉన్నారు. మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించే నజీర్ అనారోగ్యంతో మృతి చెందాడు. రిజ్వాన్‌కు పెళ్లి కుదరగా, ఈనెల 30న ఖమ్మంకు చెందిన నబీసాహెబ్‌తో వివాహం జరగనుంది. విషయాన్ని తెలుసుకున్న బుచ్చిలింగం స్పందించి, తన జన్మదినం సందర్భంగా రూ.25వేలతో పాటు, నూతన వస్త్రాలు అందజేశారు. ఓలం శ్రీనివాస్, రజిత,టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండి సంపత్‌కుమార్, ఇస్లావత్ రాజు పాల్గొన్నారు.

శుభ్రతతోనే వ్యాధులు దూరం

పెద్దవంగర : వ్యక్తిగత శుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని వైద్యాధికారులు డాక్టర్ జ్వలిత, ఫాతీమా అన్నారు. మండలంలోని చిన్నవంగరలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఎస్‌ఓ స్రవంతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జలాభిషేకం

గార్ల: కార్తీకమాసం చివరి రోజు సందర్భంగా శుక్రవారం స్థానిక శివాలయంలో భవాని సమేత రామలింగేశ్వరస్వామి (శివలింగం)కి 108 గంగాళాలతో మహిళలు సామూహిక జలాభిషేకం నిర్వహించారు. అయ్యప్ప మాల ధారులు సైతం శివలింగంకు జలాభిషేకం నిర్వహించారు. వేదపండితుడు ఎస్. ప్రవీణ్‌కుమార్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

విద్యతోనే సమగ్రాభివృద్ధి

మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు విజ్ఞానం, విలువలతో కూడిన విద్యాభ్యాసాన్ని అభ్యసించి సమాజంలో ఉన్నతంగా ఎదగాలని సుస్రుత ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ మాలోతు రవీందర్ చౌకీదార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను డీఈఓ, డాక్టర్ మాలోతు రవీందర్ చౌకీదార్‌లు ఉచితంగా అందజేశారు. అనంతరం డాక్టర్ రవీందర్‌ను డీఈఓ రవీందర్‌రెడ్డి, పాఠశాల బృందం సన్మానించారు.


ప్రమాదకరంగా చెట్టు

- ఆందోళనకు గురువుతున్న స్థానికులు

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామివారి దేవాలయం సమీపంలో ఓ గోడపై మొలిచిన చెట్టు ప్రమాదకరంగా ఉంది. అటవీశాఖకు సంబంధించిన గెస్ట్ స్టోర్ రూం గోడపై చెట్టు పెరిగి ఉండగా ఎప్పుడు విరిగి కిందపడుతుందోనని, చెట్టు విరిగినప్పుడు గోడ కూడా కూలిపోయే ప్రమాదకర పరిస్థితి నెలకొందని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్టోర్ రూం కూడా శిథిలావస్థకు చేరిందని సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన స్టోర్ రూం భవనం



అటవీశాఖ స్టోర్ రూం గోడపై ప్రమాదకరంగా ఉన్న చెట్టు

గీత కార్మికుల ఉపాధికి చర్యలు చేపట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ

- కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ

కురవి: రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, వీరి ఉపాధి మెరుగుపడే విధంగా ప్రభుత్వం ఉపాధి చర్యలు చేపట్టాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ అన్నారు. శుక్రవారం సీరోలు మండలం చింతపల్లిలోని జీహెచ్ గార్డెన్‌లో సంఘం 67వ వార్షికోత్సవాల సందర్భంగా సదస్సు యమగాని వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికుల ఉపాధి మెరుగుపడాలంటే చెట్ల పెంపకానికి భూమి ఇవ్వాలని, కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని, నీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనంలో గత ప్రభుత్వ హయాంలో నీరా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి రూ.8 కోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగిందని, బిల్డింగ్ నిర్మాణం పూర్తయిందని, సంబంధిత మిషనరీని నిర్మాణం చేశారని తెలిపారు. అవి నేడు పడావు పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో సుప్రజ ఆసుపత్రి ఎండీ శివిజయ్‌కుమార్, కిసాన్‌పరివార్ సీఈఓ డాక్టర్ వివేక్, సంఘం జిల్లా కార్యదర్శి గాని వెంకన్న, సాధుల శ్రీనివాస్, గునిగంటి రాజన్న, మోహన్, కొంపెల్లి వెంకటేష్‌గౌడ్, సీహెచ్.శ్రీనివాస్, వెంకన్న, బాలగాని నవీన్, పాలిశెట్టి రామనాథం పాల్గొన్నారు.

రాకపోకల పునరుద్ధరణ



డోర్నకల్ : మున్సిపాలిటీ పరిధిలోని నాల్గో మెయిన్ రోడ్డులో శుక్రవారం రాకపోకలు పునరుద్ధరించారు. సుమారు ఏడాది క్రితం రైల్వేశాఖ ఆధీనంలోని డ్రెయినేజీపై గోడ నిర్మాణ పనులు చేపట్టడంతో మెయిన్ రోడ్డు నుంచి రాకపోకలు నిలవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికులు రైల్వే అధికారులను కలిసి ఇబ్బందులను వివరించడంతో డ్రెయినేజీపై గోడ నిర్మాణ పనులను రద్దు చేయడంతో స్థానికులు రూ.3.5 లక్షలు సేకరించి డ్రెయినేజీపై సిమెంట్ కవరు నిర్మించారు. మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న నాల్గో మెయిన్‌రోడ్డు మీదుగా రాకపోకలను ప్రారంభించారు.కౌన్సిలర్ శీలం భాగ్యలక్ష్మిశ్రీనివాస్, నాయకులు శీలం శ్రీనివాస్, జె.వెంకటేశ్వర్లు, కిషోర్, బానోత్ శ్రీరాంనాయక్, మహేష్, నాగమణి, అనంతాచారి, యూనీస్, రాందాస్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆర్టీసీ వనభోజనాలు

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నెహ్రూసెంటర్ : మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో చేపట్టిన ఆర్టీసీ ఉద్యోగులు, కుటుంబ సభ్యుల కార్తీకమాస వనభోజనాల కార్యక్రమం డిపో ఆవరణలో శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, డ్యాన్స్‌లతో పాటు పలు రకాల పోటీలను ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ మాట్లాడుతూ ఎప్పుడూ విధుల్లో ఉంటూ ప్రజలను గమ్యస్థానాలకు చేరవేస్తూ ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడుతున్న ఉద్యోగులను మానసికంగా ఉత్సాహపరిచేందుకు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. సూపరింటెండెంట్ శ్రీమన్నారాయణ, శ్రీనివాస్, పాపిరెడ్డి, సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆర్టీసీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులతో డీఎం

జామా మసీదు పునఃప్రారంభం

గార్ల: మండల కేంద్రంలోని జామా మసీదును దాతల సహకారంతో పునర్నిర్మాణం చేసిన అనంతరం శుక్రవారం మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ.షఫీమోద్దీన్ లాంఛనంగా పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మసీదులో ఖమ్మంకు చెందిన ముఫ్తీలు ఆసిఫ్ అలీ, సయ్యద్ ఖాస్మీలు మహ్మద్ ప్రవక్త ఆచరించిన నియమాలు, ప్రస్తుతం ఆచరించాల్సిన పద్ధతులను వివరించారు. అనంతరం మసీదు పునర్నిర్మాణానికి సహకారం అందించిన దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్ జీనత్‌కుమార్, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్ నాయక్, శ్రీనివాస్, బి.హతీరాం, మసీద్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.బుడాన్, ఎండీ.రహీం ఖాన్, ఎండీ.జిలాని, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్, డోర్నకల్, కురవి, సీరోలు, కేసముద్రం, గూడూరు, మరిపెడ, నెల్లికుదురు, దంతాలపల్లి, గార్ల మండల కేంద్రాల్లో, ఆయా గ్రామాల్లోని ఆయా పాఠశాలల్లో గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షలో ప్రతిభ చూపిన విజేతలకు ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బహుమతులు అందజేసి అభినందించారు.

– సాక్షి, నెట్‌వర్క్



గార్లలో : విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎంఈఓ వీరభద్రం



గూడూరు : బాలుర హైస్కూల్‌లో..



కురవి : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నిబంధనలు పాటించాలి



మహబూబాబాద్ రూరల్ : వాహనదారులు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ ఆదేశాల మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీపురం గ్రామ శివారులో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సర్వయ్య, రూరల్ ఎస్సై దీపికరెడ్డి వాహనాలను తనిఖీ చేసి సంబంధిత పత్రాలు కలిగిఉండాలని సూచించారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధిస్తామని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలి

తొర్రూరు రూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహబుబ్‌నగర్ జిల్లాలో శనివారం చేపట్టిన రైతు పండుగ ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మార్కెట్ కార్యాలయంలో మాట్లాడారు.

సమస్యలు పరిష్కరించాలి

డోర్నకల్: గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా నాయకుడు గోవింద్ కోరారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణవేణికి వినతిపత్రం అందించారు

ధాన్యం కాంటాలను వేగవంతం చేయాలి

తొర్రూరు రూరల్ : కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని కాంటాలు పెట్టడం వేగవంతం చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.

రమేశ్‌ను కోర్టులో హాజరుపర్చాలి

నెల్లికుదురు: కామ్రేడ్ రమేశ్‌ను వెంటనే కోర్టులో హాజరుపర్చాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఆలకుంట్ల సాయన్న అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ ఆదివాసి కుటుంబంలో పుట్టిన రమేశ్ ఆదివాసులతో పాటు పేద ప్రజల హక్కుల కోసం పనిచేస్తున్న క్రమంలో పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గార్ల: కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం బండ వెంకన్న కళాజాత బృందంచే స్థానిక నెహ్రూసెంటర్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. గార్ల, పినిరెడ్డిగూడెం, పుల్లూరు గ్రామాల్లో కళాజాత బృందం ప్రదర్శనలు ఇచ్చారు.

ఘనంగా దీక్షా దివస్

కొత్తగూడ: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పురస్కరించుకుని దీక్షా దివస్‌గా శుక్రవారం మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

బాధ్యులను శిక్షించాలి

మహబూబాబాద్: మలకపేట గిరిజన న్యాయవిద్యార్థిని ఇస్లావత్ శ్రావ్య మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని గోర్ సేన రాష్ట్ర కోశాధికారి బి.హరిలాల్, జిల్లా అధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందచేశారు.

సింహగర్జన సభను విజయవంతం చేయండి

గూడూరు: డిసెంబర్ 1న సికింద్రాబాద్‌లో జరుగబోయే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా కార్యదర్శి బెజ్జం రమేశ్ కోరారు. భద్రాచలంలో చేపట్టిన మహాపాదయాత్ర డిసెంబర్ 1తో సభ ముగుస్తుందన్నారు.

కూలీలకు జీవనభృతి అందించాలి

తొర్రూరు: వ్యవసాయ కూలీలకు జీవనభృతి అందించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ గణేష్‌కు వినతిపత్రం సమర్పించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గూడూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీటీసీ, మాజీ మండల అధ్యక్షుడు కత్తి స్వామి అన్నారు. మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు సెంటర్‌లో శుక్రవారం రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఎమ్మార్సీ ఎదుట నిరసన

కేసముద్రం: సమగ్ర శిక్ష ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎమ్మార్సీ భవనం ఎదుట భోజన విరామ సమయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

కనుల పండువగా 'లక్షబిల్వార్చన' పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి లక్షబిల్వార్చన మహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. భక్తులకు అన్నదానప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపన వేడుకలు

కురవి: స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం పార్వతీ రామలింగేశ్వరస్వామి, నవగ్రహాలు, నాగేంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వేదపండితుడు బుక్కమఠం వీరన్న నేతృత్వంలో నర్సింహమూర్తి, రాధాకృష్ణమూర్తి, కౌశిక్, మధు, విజయ్‌లు కురవి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

రైతుభరోసా అందించాలి

మరిపెడ : రైతు భరోసా రైతులకు అందించి ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. మరిపెడలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ ముగిసి రబీ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల వద్దకు పోకుండా రైతుభరోసా ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు.

హామీలను నెరవేర్చాలి

కురవి: కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.

ప్రసాద్ మృతి పార్టీకి తీరనిలోటు

కురవి/నెహ్రూసెంటర్: ఖమ్మం జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి పోటు ప్రసాద్ రెండురోజుల క్రితం మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా సీపీఐ నాయకులు శుక్రవారం ఖమ్మంలో జరిగిన అంతిమ యాత్ర, సంతాప సభలో పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

దంతాలపల్లి : మండలంలోని ప్రజాసమస్యలు పరిష్కరించాలని ఎంసీపీఐ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలు తీర్చాలని తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

కేసముద్రం : రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నారంలో కేసముద్రం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో క్వింటాకు రూ.2320లతో పాటు, బోనస్‌గా రూ.500లను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, ధన్నసరి పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ప్రజాపాలన యేడాది పూర్తయిన సందర్భంగా రైతుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రైతులను, సంఘాల నాయకులను ఘనంగా సన్మానించారు. మార్కెట్ వైస్ చైర్మన్ ఐలుమల్లు, సొసైటీ వైస్ చైర్మన్‌న్లు మహేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, గ్రేడ్–3 సెక్రటరీ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు రమేష్, వసంతరావు, యాదగిరి, మధుసూదన్, రాము, శ్రీనివాస్, విజయ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్ అప్రజాస్వామికం

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు

మహబూబాబాద్ రూరల్ : బంగ్లాదేశ్ ఇస్కాన్ ప్రతినిధి చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్ అప్రజాస్వామికమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై జరుగుతున్న దాడికి నిరసనగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి, శ్రీఅయ్యప్పస్వామి దేవాలయాల ప్రాంగణంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు సింగని అశోక్ స్వామి ఏర్పాటు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశం ఇరుగుపొరుగు దేశాలతో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటుందన్నారు. భారత అనుకూల షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత బంగ్లాదేశ్‌లో హిందువులపై, ఆలయాలపై దాడులు పెరగడం దారుణమన్నారు. మోదీ సర్కార్ విదేశాంగ విధానంలో అవలంబిస్తున్న కొన్ని పద్ధతులను వ్యతిరేకించే శక్తులు అంతిమంగా సనాతన ధర్మాన్ని లక్ష్యంగా మార్చుకోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నలమాస విక్రంగౌడ్, గంధ్రాతి మల్లేష్, రామకృష్ణ, సాయికిరణ్, శ్రీనివాస్, రమేష్, బాలకృష్ణ, కిరణ్ తేజ్, శ్రీనివాస్, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంతన్ రామరాజు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- సంకల్ప ప్రాజెక్ట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్



మాట్లాడుతున్న సంకల్ప పీడీ అరుణ్‌కుమార్

మహబూబాబాద్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఏ సమస్య వచ్చినా ఎదుర్కొగలుగుతారని సంకల్ప ప్రాజెక్ట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. దైవకృప వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వేల్పుల సత్యంనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రాన్ని శుక్రవారం అరుణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కుట్టుమిషన్ కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 30 రోజుల శిక్షణ తర్వాత ప్రభుత్వం తరఫున సర్టిఫికెట్లు వస్తాయన్నారు. శిక్షణ పొందిన తర్వాత మహిళలకు ప్రభుత్వపరంగా కూడా లబ్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లోకేష్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతి, ప్రోగ్రాం ట్రైనర్లు స్వప్న, విజయకుమారి, పాల్గొన్నారు.

మన్ననలు పొందడం అభినందనీయం

బయ్యారం: ప్రభుత్వ అధికారులు విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ నర్మద పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం మండలంలోని గంధంపల్లిలోని వెనిగళ్ల జగ్గయ్య ప్రజా కల్యాణ మండపంలో నిర్వహించిన సన్మానసభను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. డిప్యూటీ సీఈఓను కలెక్టర్ సన్మానించారు. అదనపు కలెక్టర్‌లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సవ్ టొప్పో, వీరబ్రహ్మచారి, అధికారులు, జిల్లా, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



నర్మదను సన్మానిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

హార్వెస్టర్ కిందపడి ఆపరేటర్ మృతి

మరిపెడ రూరల్: హార్వెస్టర్ (వరికోత మిషన్) టైర్ల కింద పడి ఓ ఆపరేటర్ మృతి చెందిన సంఘటన మండలంలోని గుండెపుడిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గుండెపుడికి చెందిన పసునూటి హరీష్‌రెడ్డికి హార్వెస్టర్ నడపడానికి తమిళనాడు రాష్ట్రం మధురై జిల్లా కుంభకోణం గ్రామానికి చెందిన రాజు, సత్తిరాజు ఆపరేటర్లను రప్పించుకొని పనిలో పెట్టుకున్నాడు. ఈ క్రమంలో రాజు గ్రామానికి చెందిన అంగడి రాములు హార్వెస్టర్‌తో పొలం కోస్తుండగా, మరో ఆపరేటర్ సత్తిరాజు (40) అక్కడే సమీపంలో నిద్రిస్తున్నాడు. ఈ నేపథ్యంలో వరికోత మిషన్ టైర్లు నిద్రలో ఉన్న సత్తిరాజు తలపైకి ఎక్కడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతికి కారణమైన ఆపరేటర్ పరారయ్యాడు.

ఆర్మీ జవాన్‌కు ఘన నివాళి

మహబూబాబాద్ రూరల్: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతా ఆర్మీ బేస్ క్యాంపులో గుండెపోటుతో మృతి చెందిన ఆర్మీ జవాన్ కొదిరిపాక సతీష్‌కు జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి అతడి మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు నివాళులర్పించారు. మూడుకొట్ల సెంటర్ నుంచి ప్రధాన వీధుల గుండా యువతీ యువకులు జాతీయ జెండాలను చేతబూని ఊరేగింపు నిర్వహించి, అర్ధరాత్రి మృతుడి స్వగ్రామమైన డోర్నకల్ పట్టణానికి సాగనంపారు.



అదుపుతప్పి పల్టీకొట్టిన కారు.. నలుగురికి గాయాలు

మరిపెడ రూరల్: అదుపు తప్పి కారు కరకట్టపై నుంచి కిందకు పల్టీ కొట్టగా అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలైన సంఘటన మండలంలోని పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద 365 జాతీయ రహదారి కరకట్టపై గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మహబూబాబాద్ కేంద్రం నుంచి వయా మరిపెడ మీదుగా సూర్యాపేట వైపు కారులో నలుగురు బయలుదేరారు. పురుషోత్తమాయగూడెం ఆకేరు బ్రిడ్జి వద్ద కర కట్టపై గల 365 జాతీయ రహదారి ఇటీవల భారీ వర్షాలకు ధ్వంసమై ఉంది. రాత్రి వేళలో ఇది గమనించని కారు డ్రైవర్ వేగంగా దూసుకపోవడంతో కారు అదుపు తప్పి మామిడి తోటలోకి పల్టీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న బోడపల్ల జగమ్మ, సోమయ్యలకు తీవ్రగాయాలు కాగా, రమేష్, సంతోష్‌లు స్వల్ప గాయాతో బయటపడ్డారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కురవి : మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి)లోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎ.అనిల్, రాజోలు హైస్కూల్‌కు చెందిన మాలోతు లోకేష్, ధరావత్ రోహిత్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎంలు కె.జానయ్య, ఆళ్ల రవికుమార్, పీడీలు పి.కమల్‌కిషోర్, పి.కాశీనాథ్ శుక్రవారం తెలిపారు. ఈనెల 30 నుంచి డిసెంబర్ 2 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు.

పెద్దవంగర: జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో సత్తా చాటిన చిట్యాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండలంలోని చిట్యాల పాఠశాల విద్యార్థులు ఆర్.లోకేష్, రవి కీర్తన్‌లు డిసెంబర్ 14, 15 తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు.

యోగా పోటీలకు పరిశీలకురాలిగా పీఈటీ

మహబూబాబాద్అర్బన్ : 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30, డిసెంబర్ 1న కామారెడ్డిలో జరగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మానుకోట మున్సిపల్ పరిధి లోని జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన పీఈటీ పుష్పలీల పరిశీలకురాలుగా ఎంపికైందని హెచ్‌ఎం వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. పుష్పలీల మాట్లాడుతూ.. తనకు రాష్ట్రస్థాయిలో పరిశీలకురాలుగా అవకాశం రావడం చాల సంతోషంగా ఉందన్నారు.